సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 16 । అక్టోబర్ । 2024



అప్రమత్తతే ఆయుధం

అక్టోబర్ అంటేనే విపత్తుల మాసం. ఈ నెలలో అప్రమత్తతే ఆయుధం.

- 10లో



కొండపల్లి కొండపై ఎలుగుబంట్లు

కాశీబుగ్గ: కొండపల్లి అనే కొండపై ఎలుగు బంట్లు తిష్టవేశాయి. పలాస మండలం చిన్నబిలావత్తి, పెద్ద బిలావత్తి గ్రామాలకు ఆనించి ఉన్న తోట లో నివాసాల వద్దకు వచ్చేస్తున్నాయి.



సిరిమానును అధిరోహించిన పూజారి వెంకటరావు

న్యూస్‌రీల్

ఇసుక అక్రమ నిల్వలు సీజ్



బావాజీపేట వద్ద ఇసుక అక్రమ నిల్వలను సీజ్ చేస్తున్న జిల్లా అధికారులు

ఆమదాలవలస/ శ్రీకాకుళం రూరల్: ఆమదాలవలస మండలంలోని దూసి గ్రామం నాగావళి నదిలో తవ్వి శ్రీకాకుళం మండలం మీదుగా తరలించడానికి సిద్ధం చేసిన ఇసుకను మైన్స్, రెవెన్యూ, పోలీసు అధికారులు మంగళవారం సాయంత్రం సీజ్ చేశారు. దూసి నుంచి ఇసుకను తీసుకెళ్లి శ్రీకాకుళం రూరల్ మండలం బావాజీపేటలోని ఒక రబ్బర్ తయారీ ఇండస్ట్రియల్ ఏరియాలో నిల్వ చేసి రాత్రి వేళల్లో లారీలతో తరలిస్తుంటారు. ఇక్కడి ఇసుకనే అధికారులు సీజ్ చేశారు. అధికారులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి...

నాగావళి నది నుంచి ఇసుక తరలించి రాగోలు వద్ద గల తోటల్లో, జెమ్స్ ఆస్పత్రి వెనుకభాగంలో, బావాజీ పేట సమీపంలో సుమారు 60 లారీల వరకు నిల్వ చేసినట్లు గుర్తించారు. ఈ అక్రమ నిల్వలు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అనుచరులవిగా భావిస్తున్నారు. ఆమదాలవలస మండలంలోని తొగరాం గ్రామానికి చెందిన తమ్మినేని రవికాంత్ అనే వ్యక్తి లీజ్‌కు తీసుకొని ఇలా అక్రమ నిల్వలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. రాత్రివేళల్లో అక్రమంగా తరలించేందుకు ఇక్కడ అక్రమంగా నిల్వ చేస్తున్నారని తహసీల్దార్ గణపతి తెలిపారు.

కూన రవికుమార్‌కు వాటాలు వెళ్తున్నాయి




సీజ్ చేసిన ఇసుక వద్ద మాట్లాడుతున్న చిరంజీవినాగ్

ఈ ఇసుక అక్రమ రవాణాలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ హస్తం ఉందని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు తమ్మినేని చిరంజీవినాగ్ ఆరోపించారు. ఈ ఇసుక అక్రమ రవాణాను గమనిస్తూ అధికారులకు సమాచారం అందించామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ అనుచరుడు, గతంలో టీడీపీ ప్రభుత్వంలో నీటిసంఘాల అధ్యక్షుడిగా పనిచేసిన తమ్మినేని అమరనాథ్ కుమారుడు రవి కాంత్ ఈ అక్రమ ఇసుక రవాణా చేస్తున్నాడని తెలిపారు. ఆయనకు అండగా ఉన్న కూన రవి కుమార్‌కు వాటాల రూపంలో రూ.కోట్లు అందజేస్తున్నారని అన్నారు. ఆమదాలవలసలో ఇసుకను తవ్వేస్తూ.. తన చేతికి మట్టి అంటకుండా శ్రీకాకుళం రూరల్ ప్రాంతాల్లో వ్యాపారం చేయిస్తున్నారని తెలిపారు.

లాటరీ లక్కు ఎవరిదైనా..

పచ్చనేతలకే పెత్తనం కిక్కు



- టీడీపీ నాయకులకే అత్యధిక షాపులు
- అంతా ఎల్లో సిండికేట్ గుప్పిట్లోనే..
- తటస్తులను 'దారిలోకి' తెచ్చుకుంటున్న అధికార పార్టీ నాయకులు
- నేడు తెరచుకోనున్న ప్రైవేటు మద్యం దుకాణాలు

• నరసన్నపేట నియోజకవర్గంలోని పోలాకి మండలంలో టీడీపీయేతరులకు నాలుగు షాపులు వచ్చాయి. ఒక ఎమ్మెల్యే ఫోన్ చేసి ఒక్కొక్క షాపునకు రూ.25లక్షలు చొప్పున, నాలుగింటికి రూ.కోటి ఇస్తానని ఆఫర్ చేశారు. అయితే తాము చాలా ఎక్కువ షాపులకు దరఖాస్తు చేశామని, దరఖాస్తులకే కోట్లాది రూపాయలు ఖర్చయ్యాయని, తాము సొంతంగానే షాపులు నడుపుకుంటామని చెప్పారు. కానీ ఆ ఎమ్మెల్యే ఒత్తిడి చేస్తూనే ఉన్నారు.

• నరసన్నపేటలోని 76 నంబర్ గల షాపు కలవరపు సంధ్యారాణికి లాటరీలో వచ్చింది. వీరిని ఒక ఎమ్మెల్యే పిలిపించుకుని బెదిరించారు. షాపు ఇచ్చేయాలని, ఇవ్వకపోతే బిజినెస్ ఎలా చేస్తావో చూస్తానని బెదిరించడంతో వారు సరెండర్ అయిపోయారు. ఏడాదికి రూ.20లక్షల ఇస్తామన్న ఎమ్మెల్యే ఆఫర్‌కు అంగీకారం తెలిపినట్టు సమాచారం.

• పాతపట్నంలోని పలు దుకాణాలు ఒడిశాకు చెందిన వ్యాపారులకు దక్కడంతో వారికి ఎమ్మెల్యే అనుచరులు ఫోన్ చేసి సతాయిస్తూనే ఉన్నారు. గుడ్‌విల్‌కు షాపులు ఇచ్చేయాలని ఒత్తిడి చేస్తూనే ఉన్నారు. తమ దారికి రాకపోతే వ్యాపారం చేయలేరని బెదిరించడంతో సదరు షాపుల వ్యక్తులు సందిగ్ధంలో పడ్డారు.

• కొత్తూరులో 83, 84 దుకాణాలు ఒడిశాలోని పర్లాకిమిడి, గుణుపూర్ వాళ్లకు వచ్చాయి. షాపులు తమకిచ్చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. కుదరకపోతే వాటాలైనా ఇవ్వండి లేదంటే తమ సిండికేట్‌లో చేరాలని టీడీపీ నాయకులు ఫోన్లు చేసి సతాయిస్తున్నారు.

• పలాస, ఇచ్ఛాపురం, ఆమదాలవలస నియోజకవర్గాల్లో కూడా దాదాపు ఇదే పరిస్థితి ఉంది. టెక్కలి నియోజకవర్గంలో వన్‌మేన్ షో.. అక్కడ ప్రత్యర్థులే లేకుండా పోయారు. ఓ కీలక నేత సోదరుడి కనుసన్నల్లోనే షాపులన్నీ నడుస్తున్నాయి.



పోలాకిలో ముస్తాబవుతున్న మద్యం దుకాణం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ప్రైవేటు మద్యం దుకాణాలు నేటి నుంచి తెరచుకోనున్నాయి. మెజారిటీ దుకాణాలను తమ చేతుల్లోకి తెచ్చుకున్న టీడీపీ నాయకులు నేటి నుంచి నిషాలో కాసుల వేట మొదలుపెట్టనున్నారు. షాపులు దక్కించుకున్న 'ఇతరులను' బెదిరించి, బుజ్జగించి, పట్టుబట్టి తమ దారికి తెచ్చుకున్నారు. ఎమ్మెల్యే స్థాయి వ్యక్తులే రంగంలోకి దిగి టీడీపీయేతరులకు వచ్చే దుకాణాల కోసం పెద్ద ఎత్తున మంతనాలు జరిపారు. ఎక్కడైతే డీల్ కుదిరిందో అక్కడ ఒక్కో షాపుకి ఏడాదికి రూ.20లక్షల నుంచి రూ.25లక్షలు చొప్పున ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. కొన్నిచోట్ల షాపులో వాటా ఇవ్వడానికి, మరికొన్ని చోట్ల నెలకింత అని ముడుపులు ఇవ్వడానికి ఒప్పందాలు చేసుకున్నట్లు సమాచారం.



ఎల్లో సిండికేట్..

జిల్లాలో మళ్లీ పాత రోజులొచ్చేశాయి. అధికారంలో ఉన్న టీడీపీ అంతా తానై వ్యవహరిస్తోంది. ఇప్పటికే అత్యధిక షాపులు దక్కించుకున్న టీడీపీ నాయకులు ఎల్లో సిండికేట్‌గా ఏర్పడ్డారు. మిగిలిన వారిని సిండికేట్‌లో చేర్చుకునే దిశగా మంతనాలు జరిపారు. సిండికేట్‌గా ఏర్పడకపోతే సొంతంగా వ్యాపారం చేయలేమని, రక్షణ కోసం కొందరు తప్పని పరిస్థితుల్లో సిండికేట్‌లో చేరిపోయారు. దీంతో నిర్ణయాలన్నీ ఏకపక్షమే కానున్నాయి. కొన్ని రోజులు ఆగితే నచ్చిన ధర నిర్ణయించుకుని విక్రయాలు చేపట్టనుంది. ప్రభుత్వం కూడా సిండికేట్‌ను ప్రోత్సహించేలా వ్యవహరిస్తోంది. మద్యం ద్వారా వీలైనంత ఆదాయం సంపాదించాలని, పార్టీకి కూడా ఆదాయం గట్టిగా రావాలన్న ఉద్దేశంతో ఎక్కడికక్కడ తమ వాళ్లకే షాపులు దక్కేలా పథక రచన చేసింది. అనుకున్న విధంగా టీడీపీ వాళ్లకే అత్యధిక షాపులు దక్కాయి.



షాపుల ఏర్పాటులో బిజీబిజీ..

- షాపులు దక్కించుకున్న వారంతా వాటి ఏర్పాట్లలో మంగళవారమంతా నిమగ్నమయ్యారు.
- బుధవారమే షాపులు తెరిచే ముహూర్తం కానుండటంతో మందీమార్బలంతో సిద్ధం అవుతున్నారు.
- నచ్చిన ప్రాంతాల్లో ప్రారంభించేందుకు యుద్ధ ప్రాతిపదికన షాపులు అద్దెకు తీసుకున్నారు. అవసరమైన సిబ్బందిని నియమించుకున్నారు. వ్యాపారంలో ఆరితేరిన వారిని పక్కన పెట్టుకుంటున్నారు. గతంలో లిక్కర్ షాపుల్లో పనిచేసిన వారిని మళ్లీ పిలుస్తున్నారు.
- న్యూసెన్స్‌గా ఉన్న చోట ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న దానిపై సమాలోచనలు చేశారు.
- జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో చాలా వరకు ప్రస్తుతం నడుస్తున్న ప్రభుత్వ మద్యం షాపుల గదుల్లోనే తెరిచేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సిండికేట్‌గా ఏర్పడిన వారంతా ఎక్కడ షాపులు ఏర్పాటు చేయాలి? వ్యాపారాన్ని ఎలా విస్తరించాలి? తదితర విషయాలపై సమావేశమై చర్చిస్తూ బిజీ బిజీగా కనిపించారు.

ఇకపై చంద్రన్న బ్రాండ్లు

సంపద సృష్టిలో భాగంగా టీడీపీ నేతలకు కూటమి ప్రభుత్వం మద్యం షాపులను బార్లా తెరిచింది. దీంతో మద్యం ఏరులై ప్రవహించనుంది. బెల్ట్‌షాపులు పడగెత్తనున్నాయి. విచ్చలవిడిగా మద్యం దొరకనుంది. మరోవైపు కూటమి మద్యం ప్రజలకు అందుబాటులో రానుంది. చంద్రన్న బ్రాండ్ల విక్రయించనున్నట్లు సమాచారం. ఇప్పటికే అందుకు తగ్గ ఏర్పాట్లు జరిగిపోయాయి. స్వామి కార్యం స్వకార్యం అన్నట్టుగా అటు ప్రభుత్వానికి, ఇటు వ్యక్తిగతంగా ఆదాయం సమకూరేలా ప్రైవేటు మద్యం పాలసీని డిజైన్ చేశారు.



కోట పరిసర ప్రాంతాల్లో జనసందోహం మధ్య సిరిమానోత్సవం

జనం చెంతకు.. సిరులతల్లి

- పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవానికి పోటెత్తిన భక్తజనం

సిరులతల్లి సిరిమాను పూజారి రూపంలో విజయనగరం వీధుల్లోకి తరలివచ్చిన వేళ భక్తలోకం మురిసిపోయింది. జై పైడిమాంబ.. జైజై పైడిమాంబ నామాన్ని స్మరిస్తూ ఉప్పొంగిపోయింది. సిరిమాను పూజారి ఆశీస్సులు అందుకునేందుకు పరితపించింది. అరటి పండ్లను సిరిమానుపైకి విసిరి తల్లి కరుణాకటాక్షాలను అందుకుంది. చదురుగుడి నుంచి కోట వరకు మూడుసార్లు సాగిన అమ్మవారి సిరిమాను తిరువీధి ఉత్సవాన్ని ఆసక్తిగా తిలకించింది. రోజంతా ఆధ్యాత్మిక చింతనతో గడుపుతూ పైడితల్లీ.. కరుణించమ్మా అంటూ ప్రార్థించింది.

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారు సిరిమానుపై విహరించిన వేళ విద్యలనగరమైన విజయనగరం భక్తజనంతో కిక్కిరిసింది. పైడితల్లి నామస్మరణతో దారులన్నీ కిటకిటలాడాయి. మంగళవారం సాయంత్రం దాదాపు రెండు గంటల పాటు సాగిన సిరిమానోత్సవాన్ని దూరం నుంచే తిలకించిన భక్తజనం అమ్మ ఆశీస్సులందుకుంది. ఉత్సవం ఆద్యంతం సంప్రదాయబద్ధంగా సాగింది. ముందు పాలధార, ఆ వెంట జాలరి వల, తెల్ల ఏనుగు, అంజలిరథం వెన్నంటి రాగా అమ్మవారి ప్రతిరూపమైన సిరిమాను భక్తులందరినీ అలరిస్తూ ముందుకు కదిలింది. సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. జిల్లా వాసులే కాకుండా రాష్ట్రంలో వివిధ ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు అమ్మను దర్శించుకున్నారు. సిరిమానుపై గగనాన విహరించే ప్రధాన పూజారి బంటుపల్లి వెంకటరావును అమ్మకు ప్రతిరూపంగా భావించి మొక్కుకున్నారు.

అంగరంగ వైభవంగా..

విజయనగరంలోని హుకుంపేటలో నిష్ణాతులైన వడ్రంగులు తయారుచేసిన ఇరుసుమాను, సిరిమానును మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటల సమయానికి పైడితల్లిని చదురుగుడి వద్దకు తీసుకొచ్చారు. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఆర్డీఓ దాట్ల కీర్తి పర్యవేక్షణలో సిరిమాను సిద్ధం చేశారు. మధ్యాహ్నం 3:26 గంటలకు సిరిమానుపై ప్రధాన పూజారి బంటుపల్లి వెంకటరావు ఆసీనులయ్యారు. దీంతో సిరిమాను ఉత్సవం మొదలైంది. భక్తుల జయజయ ధ్వానాలు హోరెత్తాయి. చదురుగుడి నుంచి కోట ముఖద్వారం వరకూ మూడుసార్లు సిరిమాను ప్రధాన వీధిలో నడయాడింది. సాయంత్రం 5:21 గంటలకు ఉత్సవం ముగిసింది.



జాలారి వల



తెల్ల ఏనుగు



అంజలి రథం

స్థానికులకు అర్హత లేదంట..!

- ఇసుక టెండర్లన్నీ అమరావతి కనుసన్నల్లోనే
- గత అర్ధరాత్రి కలెక్టరేట్‌లో హైడ్రామా
- స్థానికులకెవ్వరికీ అర్హత లేదంటూ ఆర్డీవోల ధ్రువీకరణ



బిడ్ ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

అరసవల్లి: ఇసుక టెండర్లు వేయడానికి స్థానికులకు అర్హత లేదు. అమరావతి వారికి మాత్రమే ఆ హక్కు, అర్హత ఉన్నాయి. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఇసుక రీచ్‌ల హక్కుల కోసం టెండర్ ప్రక్రియలో అధికారులే ఈ విషయాన్ని కుండబద్దలు గొట్టినట్లు చెప్పారు. ఇసుక రీచ్‌ల హక్కుల కోసం నిర్వహించిన టెండర్ ప్రక్రియ అంతా దాదాపుగా ఏకపక్షంగా జరిగింది. జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సీల్డు టెండర్ల ఖరారు విషయంలో టీడీపీ రాష్ట్ర ముఖ్య నేతల కనుసన్నల్లోనే అన్నీ జరిగాయి. పార్టీ రాష్ట్ర పెద్దల సూచనల మేరకు అన్ని జిల్లాల్లోనూ ముఖ్యంగా నాణ్యమైన ఇసుక లభించే శ్రీకాకుళం జిల్లా ఇసుకపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో ఎలాగైనా ఇక్కడి మన ఇసుకను కొట్టేసేలా ప్రణాళికలు అమలు చేశారు.

అర్ధరాత్రి నుంచే హడావుడి

జిల్లాలో అంబళ్లవలస, బూరవల్లి, హయాతినగరం, బట్టేరు, గోపాలపెంట, నివగాం తదితర ఆరు రీచ్‌లకు గాను నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో సీల్డు టెండర్లలో మొత్తం 38 మంది బిడ్లు దాఖలు చేసిన సంగతి విదితమే. అయితే వాస్తవానికి సోమవారం సాయంత్రమే టెండర్ బాక్సును తెరిపించి అర్హుల పేర్లను ప్రకటించాలని జిల్లా స్థాయి ఇసుక కమిటీ నిర్ణయించింది. అయితే అధికారులు నిర్ణయించిన మేరకు నిబంధనల ప్రకారం దాదాపుగా బిడ్ దాఖలు చేయలేని దరఖాస్తులన్నీ రిజెక్ట్ చేశారు. ఈక్రమంలో ఒక్కసారిగా సిండికేట్ వ్యూహాలను మార్చారు. అందరి దరఖాస్తులు అందరి ముందర స్క్రూటినీ చేయాలని కొందరు వ్యాపారులు పట్టుపట్టారు. దీంతో సోమవారం అర్ధరాత్రి నుంచే టెండర్ల ఖరారు ప్రక్రియపై హడావుడి ఎక్కువైంది. జిల్లాలో ప్రధానమైన ఈ ఆరు రీచ్‌లను దక్కించుకునేందుకు అమరావతికి చెందిన వారు అక్కడి నుంచే స్కెచ్ వేశారు. దీంతో ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు పెరిగాయి. బిడ్ దరఖాస్తుల్లో పేర్కొన్న ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఆ సమయంలో ఉన్నవి, లేనివి అంటూ పలు ధ్రువీకరణ పత్రాలపై స్క్రూటినీ మొదలు పెట్టి దాదాపుగా 28 వరకు దరఖాస్తులను రిజెక్ట్ చేస్తున్నట్లు సోమవారం అర్ధరాత్రి తర్వాత కలెక్టరేట్‌లో అధికారులు ప్రకటించేశారు. కొన్ని దరఖాస్తులను (రాజధాని ప్రాంత పెద్ద కంపెనీలు) మాత్రం లైవ్‌లో ఉంచడంతో బిడ్ దాఖలు చేసిన మిగిలిన వారంతా అధికారుల తీరుపై విమర్శలు గుప్పించారు. అందరివీ అందరి ముందే స్క్రూటినీ చేయాలని పట్టుపట్టారు. దీంతో మంగళవారం ఉదయం అందరి ధ్రువీకరణ పత్రాలను స్క్రూటినీ చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీవోలు, మైన్స్ డీడీ, డీటీఓ తదితర ఇసుక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బిడ్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ చేపట్టారు. అయితే ఇక్కడే అసలు రాజకీయం మొదలైంది. అమరావతి నుంచి హాజరైన బడా వ్యాపారులంతా కచ్చితమైన ధ్రువీకరణ పత్రాలతో బిడ్లను ఖాయం చేయించుకున్నారు.

సర్కార్ పాట రూ.110...

అమరావతి వారి పాట రూ.19

ఇసుక రీచ్‌ల నుంచి ఇసుకను తవ్వి స్టాక్ పాయింట్‌కు తరలించే హక్కులతో పాటు రవాణా చార్జీలతో కలిపి మెట్రిక్ టన్ను ధర ప్రభుత్వం తరపున రూ.110 నిర్ణయించగా, ఆశ్చర్యకరంగా టెండర్‌లో పాల్గొన్న బడా వ్యాపారులు కేవలం రూ.19 కే టెండర్ కోట్ చేసి టెండర్‌ను కొట్టేశారు. మెట్రిక్ టన్ను ఇసుక ధర రూ.110 అంటేనే తవ్వి తీసుకెళ్లడం సాధ్యం కానిపని, అంతకంటే తక్కువగా రూ.19కే టెండర్ పాటగా కోట్ చేయడం అంటే అక్రమాలకు మార్గం వేసేసినట్లే అని చెప్పాలి.

ఇష్టానుసారంగా టెండర్లు

- లోపలి పేజీల్లో..

అమ్మా.. మానుషం

- ఇద్దరు కుమారులను చంపిన తల్లి
- కూల్‌డ్రింక్‌లో విషం కలిపి తాగించిన వైనం
- అదే కూల్‌డ్రింక్ తాగి ఆత్మహత్యాయత్నం
- కుముందవానిపేటలో సంఘటన



దుర్గ (ఫైల్)

అమ్మ కూల్‌డ్రింకు ఇచ్చిందని సంబరంగా తాగేన పిల్లలకు తెలీదు.. అందులో విషం ఉందని.. తల్లి పక్కన ప్రశాంతంగా పడుకున్న ఆ చిన్నారులకు తెలీదు.. అదే తమ ఆఖరి రాత్రి అని.. ప్రాణాలు పోయాకైనా ఆ బుజ్జాయిలకు తెలీదు.. తాము చేసిన తప్పేంటో అని.. గోరుముద్దలు కలిపిన చేతితోనే ఆ తల్లి విషం కలిపింది. తొమ్మిది నెలలు మోసి, ప్రసవ వేదన అనుభవించి, రక్తాన్ని పాలుగా చేసి బిడ్డలను పెంచిన అమ్మ కన్నపేగుల ఉసురు తీసింది. బిడ్డకు చిన్న దెబ్బ తగిలితేనే అల్లాడిపోయే తల్లి ఆ పిల్లల ప్రాణాలు తీసేంత కఠినాత్మురాలైంది. కూల్‌డ్రింకులో విషం కలిపి బిడ్డలకు తాగించి అదే డ్రింకును తనూ తాగేసింది. కానీ అమాయక పిల్లలు చనిపోయారు. తల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

సంతబొమ్మాళి: మలగాం పంచాయతీ కుముందవానిపేట ఉలిక్కిపడింది. నిన్నటి వరకు ఆ ఊరి వీధుల్లో హుషారుగా తిరిగిన ఇద్దరు బిడ్డలు తెల్లారేసరికి చనిపోయారని, అమ్మే చంపేసిందని తెలిసి ఊరు బోరుమంది. తన ఇద్దరు పిల్లలకు విషమిచ్చి చంపి తాను ఆత్మహత్య ప్రయత్నం చేసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..

గ్రామానికి చెందిన వివాహిత డెక్కల రాజుతో అదే గ్రామానికి చెందిన దుర్గకు పన్నెండేళ్ల కిందట పెళ్లయ్యింది. వీరికి రుషి (10), బాలాజీ (8) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు స్థానిక ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. రాజు శ్రీకాకుళంలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. ఊరిలో తల్లీకొడుకులు మాత్రమే ఉంటున్నారు. మంగళవారం దసరా పత్రివారాలు కావడంతో.. దుర్గ తమ్ముడు హరి అక్కను ఇంటికి రావాలని సోమవారం రాత్రి పిలిచాడు. ఈ రాత్రికి భోజనాలు అయిపోయాయని, మంగళవారం ఉదయం వస్తానని ఆమె తమ్ముడికి చెప్పారు. దీంతో హరి తిరిగి వెళ్లిపోయాడు. ఉదయం ఎంతకూ అక్క రాకపోవడంతో హరి తన అక్క ఇంటికి వెళ్లాడు. తలుపులు వేసి ఉండడంతో పక్కింటి వాళ్లను అడిగాడు. ఎవరూ ఏమీ చెప్పకపోవడంతో తలుపులు గట్టిగా కొట్టడంతో దుర్గ తలుపులు తీసింది. లోపలకు వెళ్లి హరి నిర్ఘాంతపోయే దృశ్యాలు కనిపించాయి.

ఇద్దరు పిల్లలు పడుకున్న దగ్గరే చనిపోయి కనిపించారు. కూల్‌డ్రింకులో పాయిజన్ కలిపి తాగడం వల్లే చిన్నారులు చనిపోగా, ఆ పాయిజన్ తాగిన తల్లి దుర్గ కొనఊపిరితో ఉంది. వెంటనే ఆయన పోలీసులు సమాచారం ఇవ్వడంతో టెక్కలి రూరల్ సర్కిల్ సీఐ శ్రీనివాసరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. చిన్నారుల మృతదేహాలను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు ప్రయత్నించిన దుర్గను కూడా అదే ఆస్పత్రికి తీసుకెళ్లారు. భర్త సరిగా చూడకపోవడం వల్లే జీవితంపై విరక్తి కలిగి ఇలా చేశానని పోలీసులకు దుర్గ తెలిపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



విగత జీవులుగా పడి ఉన్న రుషి, బాలాజీ

పీఎం శ్రీ పథకం కింద 32 స్కూళ్ల ఎంపిక

సారవకోట: జిల్లాలో 32 ఉన్నత పాఠశాలలను పీఎం శ్రీ పథకం కింద ఎంపిక చేసినట్లు డీఈఓ ఎస్ తిరుమల చైతన్య తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన ఉన్నత పాఠశాలలో కెమిస్ట్రీ ల్యాబ్‌లు ఏర్పాటు, పాఠశాల ఆవరణ బాగు చేయడం, స్కాట్, గేమ్స్, స్పోర్ట్స్ వంటివి ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. దీనికి బుడితి ఉన్నత పాఠశాల ఎంపికైందని, ప్రస్తుతం పాఠశాల ఆవరణ బాగు చేసేందుకు రూ.5 లక్షల నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. పాఠశాలకు ఆయన ఉదయం 8.45 గంటలకు ఆయన హాజరు కాగా నలుగురు ఉపాధ్యాయులు ఆలస్యంగా వచ్చినట్లు గుర్తించి వారిని సంజాయిషీ కోరారు.

అదిరిందయ్యా ప్రసాద్

- ఏసీఏ ఆంధ్రా క్రికెట్ జట్టుకు ప్రసాద్



శ్రీకాకుళం న్యూకాలనీ: ఏసీఏ ఆంధ్రా అండర్–25 జట్టుకు శ్రీకాకుళం జిల్లాకు చెందిన సింగుపురం దుర్గ నాగ వరప్రసాద్ ఎంపికయ్యాడు. బెంగళూరు వేదికగా ఈనెల 17 నుంచి అంతర్‌రాష్ట్ర అండర్–25 పురుషుల మల్టీడేస్ పి.రామచంద్రరావు ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ జరగనుంది. ఈ మేరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రకటించిన 16 మంది సభ్యులతో కూడిన తుది జాబితాలో ఈ వర్ధమాన క్రికెటర్ చోటు దక్కించుకున్నాడు. జలుమూరుకు చెందిన ఈ కుర్రాడు వికెట్ కీపర్ కమ్ బ్యాటర్‌గా ఇటీవల కాలంలో మెరుగ్గా రాణిస్తుండటంతో అవకాశాన్ని దక్కించుకున్నాడు.



లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్ ప్రసాద్

కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో..

జలుమూరులోని పోలీస్‌స్టేషన్ వీధిలో నివాసం ఉండే ఎస్‌డీఎస్‌వీ ప్రసాద్ తండ్రి సింగుపురం ఉపేంద్ర కార్ డ్రైవర్‌గా పనిచేస్తూ 2019లో అనారోగ్యంతో మరణించగా.. తల్లి సింగుపురం రేవతి జలుమూరు ఎండీఓ కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేస్తున్నారు. యువకుడు ప్రస్తుతం టెక్కలిలోని బీఎస్అండ్‌జేఆర్ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

ఏపీఎల్ సీజన్–3లో రాణింపు..

ఏసీఏ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్ 3వ సీజన్‌లో గోదావరి టైటాన్స్‌కు ప్రాతినిధ్యం వహించిన ఈ లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్ పలు మ్యాచ్‌ల్లో రాణించాడు. అంతకుముందు అనేక ఏసీఏ రాష్ట్రస్థాయి, జోనల్‌స్థాయి టోర్నీల్లో మెరుగ్గా రాణించి సెలెక్టర్లను ఆకట్టుకున్నాడు.



తుఫాన్ల కాలం.. అప్రమత్తతే ఆయుధం

- గత పదేళ్లలో అక్టోబర్– డిసెంబర్ మధ్య 11 తుఫాన్లు
- లోతట్టు ప్రాంతాలకు పొంచి ఉన్న ముప్పు
- మత్స్యకారులు, రైతులకు జాగ్రత్తలు తప్పనిసరి



వరి పైరు

వజ్రపుకొత్తూరు: రోజురోజుకూ మారుతున్న వాతావరణ పరిస్థితులు జిల్లావాసులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. సాధారణంగా అక్టోబర్, నవంబరు నెలల్లో జిల్లాపై తుఫాన్ల ప్రభావం ఎక్కువ. గత పదేళ్లను పరిశీలిస్తే ఏకంగా పది తుఫాన్లు సంభవించాయంటే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడిందని, ఇది వాయుగుండంగా మారి తీవ్ర తుఫానుగా అవతరించి దక్షిణ కోస్తాతో పాటు మన ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు వర్షాల కురస్తాయని ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. దీని ప్రభావంతో నువ్వలరేవు, గుణుపల్లి, దేవునల్తాడ, మంచినీళ్లపేట, కంబారాయుడుపేట తీరాల్లో సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి.

సంవత్సరం	తీరం దాటిన ప్రాంతం	ప్రభావితమైన జిల్లాలు
2014 అక్టోబర్ (హుద్‌హుద్)	విశాఖపట్నం	శ్రీకాకుళం, విశాఖ, విజయనగరం
2018 అక్టోబర్ (తిత్లీ)	పల్లిసారథి(పలాస)	శ్రీకాకుళం, విజయనగరం

రైతులూ ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 4,66,159.5 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇందులో ప్రధానంగా స్వర్ణ, సాంబమసూరి రకాలే. ప్రస్తుతం పొట్ట దశ నుంచి కంకులు బయటకు వచ్చే దశలో ఉన్నాయి. లోతట్టు ప్రాంతాల్లో వరి పొలాలు ముంపునకు గురైతే పొల్లు గింజలే తప్ప పంట చేతికి రాదు. కాబట్టి లోతట్టు, ముంపు ప్రాంతాల రైతులు అప్రమత్తంగా ఉండాలి.
- ఒకవేళ వరి చేను ముంపునకు గురైతే ఉప్పుద్రావణం పిచకారి చేయాలి.
- వర్షం పడే సమయంలో నీరు నిల్వ లేకుండా చూడాలి.
- ఈ- క్రాప్ బుకింగ్‌తో పాటు పంటల బీమాలో నమోదు కావాలి.
- పంట నష్టం పరిగితే రైతులు వ్యవసాయ, రెవిన్యూ, ఇతర ఎన్యుమరేషన్ చేసే వారిని సంప్రదించాలి.

మత్స్యకారులూ బహుపరాక్..

- మత్స్యకారులు వలలు, బోట్లను సురక్షిత ప్రాంతాల్లో లంగరు వేసుకోవాలి.
- వేట సమయంలో లైఫ్ జాకెట్లు, ఇతర రక్షిత పరికరాలు బోట్‌లో ఉంచుకోవాలి.
- సముద్రం కల్లోలంగా ఉన్న సమయంలో వేటకు వెళ్లకూడదు.

జాగ్రత్తలు పాటించాలి..



ప్రస్తుతం తుఫాన్ ప్రభావం జిల్లాపై అంతగా ఉండకపోవచ్చు. ఒకవేళ భారీ వర్షాలు వస్తే రైతులు పంటను కాపాడుకునేందుకు సిద్ధం కావాలి. ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి. పంటల బీమా పథకంలో సభ్యులుగా ఉండాలి. వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.

– ఎల్.వి.మధు, ఏడీఏ, పలాస

దుర్గమ్మా.. చల్లగా చూడమ్మా!



అమలపాడు గ్రామం భక్త జనసంద్రమైంది. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన దుర్గమ్మతల్లి ఘటాల ఉత్సవానికి అశేష జనవాహిని తరలివచ్చింది. దేవీ.. పాహిమాం.. అంటూ భక్తుల శరణు ఘోషతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన పగటి వేషాలు, కాళీమాత వేషధారణలు, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీ దుర్గాదేవీ లేబర్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో 171 మంది మహిళలు ఎరుపు వస్త్రధారణలో ఘటాలతో వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ దున్న రత్నం బాలరాజు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దున్న వీరస్వామి, కె.లింగరాజు, దుర్గా దేవి లేబర్ యూనియన్ నాయకులు ఇరోతు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

– వజ్రపుకొత్తూరు

శభాష్ పోలీస్!

సమయం: సోమవారం అర్ధరాత్రి ఒంటి గంటన్నర
ప్రదేశం: పొన్నాడ వంతెన
ఏం జరిగిందంటే: ఓ యువకుడు బ్రిడ్జి పైనుంచి దూకేందుకు సిద్ధమవుతుండగా అటువైపుగా నైట్ బీట్ విధులు నిర్వర్తిస్తున్న నైట్‌బీట్ పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాణాలు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే..

శ్రీకాకుళం నగరంలోని మావూరివీధికి చెందిన గుంటముక్కల శివప్రసాద్ కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. సోమవారం అర్ధరాత్రి పొన్నాడ వంతెన వద్ద నదిలో దూకేందుకు ప్రయత్నిస్తుండగా అదే సమయంలో ఒకటో పట్టణ నైట్‌బీట్ తనిఖీ అధికారి టి.అమ్మాజీ అడ్డుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యకు చావు ఒక్కటే పరిష్కారం కాదని, క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు కుటుంబంపై తీవ్ర ప్రభావం చూపుతుందని చెప్పి.. అనంతరం పోలీసు వాహనంపై అతన్ని ఇంటికి తీసుకెళ్లి తల్లిదండ్రులకు అప్పగించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి వ్యక్తి ప్రాణాలు కాపాడిన హెచ్‌సీ అమ్మాజీ, ఆర్మ్‌డ్ రిజర్వ్ పీసీ చంద్రశేఖర్, మహిళా హోంగార్డు నారాయణమ్మలను ఎస్పీ మహేశ్వరరెడ్డి అభినందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో వారికి నగదు పురస్కారాన్ని సైతం అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు, డీఎస్పీ వివేకానంద, సీఐ పైడపునాయుడు, ఎస్‌ఐ హరికృష్ణ ఉన్నారు.



శివప్రసాద్‌ను ఇంటికి అప్పగించి కౌన్సిలింగ్ చేస్తున్న హెచ్‌సీ టి.అమ్మాజీ



సిబ్బందికి రివార్డు అందజేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

– శ్రీకాకుళం క్రైమ్

ఇష్టానుసారంగా టెండర్లు



టెండర్ దరఖాస్తులను పరిశీలిస్తున్న టెక్కలి, శ్రీకాకుళం ఆర్డీవోలు కృష్ణమూర్తి, సాయిప్రత్యూష తదితరులు

అరసవల్లి/శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఇసుక రీచ్‌ల కేటాయింపునకు సంబంధించిన టెండర్ ప్రక్రియ అంతా గందరగోళంగా మారింది. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఆరు రీచ్‌ల కేటాయింపు అంశంలో పలు వివాదాస్పద నిర్ణయాలు అమలు చేయడంతో అటు టెండర్ దారులతో పాటు వివిధ శాఖల సిబ్బంది కూడా అవాక్కయ్యారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీలో ఉన్న అధికారులు శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష, మైన్స్ డీడీ మోహనరావు తదితరులంతా వచ్చినప్పటికీ అంతా తానై టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి ఏకపాత్రాభినయం చేసినట్లుగా ఆద్యంతం ప్రక్రియ సాగింది.

నిబంధనలను తోసిరాజని..

- ఇసుక రీచ్‌ల టెండర్లకు సంబంధించిన ప్రక్రియలో ఎక్కడా నిబంధనలు పాటించలేదు.
- సోమవారం రాత్రి ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా సీల్డు టెండర్ బాక్సును ఓపెన్ చేసి మంగళవారం టెండర్‌దారుల పేర్లు ప్రకటించేలా చర్యలు చేపట్టారు.
- టెండర్ బాక్సులు తెరిచే సమయంలో బిడ్ దరఖాస్తులు వేసిన 38 మంది అక్కడ లేనేలేరు.
- మంగళవారం ఉదయం నుంచి టెండర్ ప్రక్రియలో జిల్లా ఉన్నతాధికారులెవ్వరూ లేకపోవడం గమనార్హం.

రాత్రికి రాత్రే మారిపోయిన ఏజెన్సీ

నరసన్నపేట మండలం గోపాలపెంట ఇసుక రీచ్ కేటాయింపు విషయం అత్యంత వివాదాస్పదంగా మారింది. సోమవారం అర్ధరాత్రి టెండర్ బాక్సులు ఓపెన్ చేసిన అధికారులు అప్పటివరకు ఉన్న బిడ్ దరఖాస్తులను పరిశీలించి గోపాలపెంట రీచ్‌ను ఆర్ఎస్ఆర్ (హైదరాబాద్) ఏజెన్సీకి దక్కినట్లుగా గుర్తించారు. అయితే సోమవారం అర్ధరాత్రి హైడ్రామా అనంతరం బిడ్ దరఖాస్తుదారుల ఆందోళనల ఫలితంగా మంగళవారం ఉదయం మళ్లీ టెండర్ బాక్సును ఓపెన్ చేసి ఈసారి గోపాలపెంటను పీవీఎస్ ఏజెన్సీ (శ్రీకాకుళం) వారికి కట్టబెట్టారు. వాస్తవానికి సోమవారం అర్ధరాత్రి వరకు రిజెక్ట్ అయిన పివిఎస్ ఏజెన్సీ మంగళవారం ఉదయానికి ఎలా సక్సెస్ అయ్యిందో అధికారులకే ఎరుక..! ఇదేంటని అడిగితే..ఆర్ఎస్ఆర్ ఏజెన్సీకి నెట్‌వర్త్ సర్టిఫికెట్ లేదని అందుకే రిజెక్ట్ చేశామని అధికారులు స్పష్టం చేయడం గమనార్హం.

- కొత్తూరు మండలం నివగాం రీచ్ కూడా వివాదాస్పదమైంది. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.110 కాగా, నివగాం రీచ్ దక్కించుకునేందుకు ఓ ఏజెన్సీ రూ.63కే కోట్ చేసింది. కాగా ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు చెందిన ఏజెన్సీ రూ.90గా కోట్ చేసినప్పటికీ తీవ్రమైన ఒత్తిళ్ల కారణంగా ఎమ్మెల్యే గోవిందరావు చెప్పిన ఈ ఏజెన్సీకే నివగాం రీచ్ దక్కింది.

17 నుంచి వర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఏపీ పీజీ సెట్ -2024 ద్వారా రెండు విడతల ప్రవేశాలు తర్వాత మిగిలిన సీట్లకు ఈ నెల 17 నుంచి 21 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ పి.సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలో 562 సీట్లకు 243 ప్రవేశాలు జరిగాయని, 319 ఖాళీలు ఉన్నాయని చెప్పారు. పీజీ సెట్ ర్యాంకు ఉన్నవారు మాత్రమే అర్హులని, రూ. 500 దరఖాస్తు రుసుం, ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్లకు ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వంటివి వర్తించవని స్పష్టం చేశారు.

ఏయూ దూరవిద్య స్టడీ సెంటర్ పునఃప్రారంభం

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆంధ్ర విశ్వవిద్యాలయం దూర విద్య స్టడీ సర్కిల్ మంగళవారం పునఃప్రారంభమైంది. ఏడాదిన్నర క్రితం ఇక్కడి కేంద్రాన్ని మూసివేశారు. దీంతో జిల్లా విద్యార్థులు వ్యయప్రయాసలకోర్చి విశాఖ వెళ్లాల్సివచ్చేది. పొరుగున ఉన్న ఒడిశా విద్యార్థులకు కూడా జిల్లాలోని స్టడీ సర్కిల్ ద్వారానే దూర విద్య అందేది. ఏటా సుమారు 300 నుంచి 400 వందల వరకు డిగ్రీ, పీజీ చదువుతుండేవారు. జిల్లాలో అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ప్రారంభమయ్యాక ఏయూ అధికారులు ఇక్కడి ఏయూ స్టడీ సర్కిల్ ఎత్తివేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనేక వినతులు అందించడంతో స్టడీ సర్కిల్‌ను పునఃప్రారంచడంతో పాటు ముగ్గురు ఉద్యోగులను డిప్యూటేషన్ ద్వారా నియమించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కన్వీనర్‌గా వ్యవరిస్తారు. గతంలో కోఆర్డినేటర్‌గా పనిచేసిన ఇందువదన బాధ్యతలు స్వీకరించే పక్షంలో ఆమెనే ఆ పోస్టులో కొనసాగిస్తారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ మాట్లాడుతూ స్టడీ సర్కిల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దేవీ నిమజ్జనంలో అపశ్రుతి


- విగ్రహం కిందపడి యువకుడి మృతి



నవీన్ (ఫైల్)

రణస్థలం: దుర్గాదేవి నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. విగ్రహం కింద పడి ఓ యువకుడు మృతిచెందాడు. జే.ఆర్.పురం పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రణస్థలం మండలం అక్కయ్యపాలెంలోని యర్ర చెరువులో సోమవారం రాత్రి 11 గంటల సమయంలో దుర్గాదేవి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఆ సమయంలో గ్రామానికి చెందిన దాన నవీన్ (21) ప్రమాదవశాత్తు విగ్రహం కింద పడిపోయాడు. ఆ సమయంలో ఎవరూ గుర్తించలేదు. పక్క గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నందున అక్కడికి వెళ్లి ఉంటాడని కుటుంబ సభ్యులు భావించారు. వేకువజాము 3 గంటల వరకు ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి వెతికారు. చెరువులో నిమజ్జనం చేసిన విగ్రహాన్ని లేపగా అక్కడే నవీన్‌కుమార్ కూరుకుపోయి ఉన్నాడు. దీంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. నవీన్ ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. జే.ఆర్.పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి, సిబ్బంది వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి దాన లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింపు



దూసి వద్ద పట్టపగలే అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లు, అడ్డుకున్న గ్రామస్తులు

ఆమదాలవలస: మండలంలోని దూసి గ్రామంలో నాగావళి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఆ గ్రామానికి చెందిన కొంతమంది అడ్డుకున్నారు. రాత్రింబవళ్లు నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లు నడిపిస్తుండడంతో తమ పంటపొలాలతోపాటు, తోటలు, కళ్లం స్థలాలు నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా పట్టపగలే జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో కాసేపు ట్రాక్టర్ యజమానులకు, గ్రామస్తులకు మధ్య ఘర్షణ జరిగింది. కొంతమంది గ్రామ పెద్దలు జోక్యం చేసుకొని సద్దుమణిగించారు.